# మిత్రవైరం

## వసుంధర

మా పక్కింట్లో నారాయణ మూర్తిగారుండడం మా అదృష్టమేనని మా యింటికి వచ్చి వెళ్ళిన బంధువులంతా అంటూంటారు.

నారాయణ మూర్తిగారి వయసు నలభై అయిదుంటుంది. ఆయనకిద్దరే పిల్లలు. ఓ అబ్బాయి, అమ్మాయి. భార్య అనుకూలవతి.

వారింట్లో అందరికీకూడా ప్రజాసేవ ముందు. స్వంత పనులు తర్వాత.

నాకు పెళ్ళై ఏణ్ణర్థమయింది. ట్రాన్స్ఫర్‌మీద ఈ ఊరొచ్చి ఎనిమిది నెలలయింది. నారాయణమూర్తిగారి పక్కిల్లు దొరికింది.

నారాయణమూర్తిగారింట్లో టెలిఫోనుంది. అక్కడ పబ్లిక్ టెలిఫోను కంటె పెద్ద క్యూ ఉంటుంది. ఆ వీధిలోవాళ్ళు, ఆ వీధిలో వాళ్ళకి తెలిసినవాళ్ళు, తెలిసిన వాళ్ళకి తెలిసినవాళ్ళు - అందరూ విధిగా ఆయన ఫోన్‌నే ఉపయోగిస్తారు. ఇంటికొచ్చిన వారిని నవ్వుతూ పలకరించడమే కాక ఆయన భార్య కాఫీ టీలతో సత్కరిస్తుంది.

నారాయణ మూర్తిగారు అన్ని తెలుగు వార, మాస పత్రికలూ-కొన్ని ప్రముఖ ఇంగ్లీషు పత్రికలూ - చాలా తెలుగు నవలలూ కొంటారు. ఆయన కొంటున్నారని చాలామంది పుస్తకాలు కొనడం మానేశారు. మా వీధిలో పుస్తకాల గురించి వచ్చే పోయేవారితో కూడా ఆయన ఇల్లు సందడిగా ఉంటుంది.

నారాయణమూర్తి గారింట్లో స్టీరియో రికార్డు ప్లేయర్సు కాసెట్సు డెక్కు ఉన్నాయి. ఆయన చాలా రికార్డులు, కాసెట్స్ కొంటారు. ఎందరో ఆయనకు కాసెట్స్‌చ్చి పాటలు రికార్డింగు చేయించుకొంటూంటారు.

మాకు రేషన్‌కార్డు ఆయనే సంపాదించి పెట్టారు.

నా ఆఫీసు టైముకి రేషను షాపుల టైములకీ కుదరడంలేదని మా రేషన్ తెచ్చి పెట్టే బాధ్యత ఆయన తన కొడుక్కిచ్చాడు.

ఆయనలో ప్రత్యేకతేమిటంటే ఎప్పుడూ దేనికీ విసుక్కోడు.

టెలిఫోను గురించి మీకిబ్బంది కదా



అంటే, ఆ వంకనైనా కాస్త మాయింటి కొస్తున్నారు కదా అంటాడాయన. అనవసరంగా కాఫీ టీలెందుకండీ అంటే ఇంటికొచ్చినవారికి ఆమాత్ర మివ్వగలస్తోమతుండడం నా అదృష్టమంటాడాయన పుస్తకాల గురించైతే - కొన్న పుస్తకం ఎక్కువ మందిచేత చదివిస్తేనే - కొన్నవాడు ధన్యుడౌతాడంటాడాయన. రికార్డింగ్ గురించి - "ఇందులో శ్రమేముంది నేను పాటలు వింటూంటే అటు రికార్డింగై పోతుంది-" అంటాడాయన.

ఇలా ఇతరులకేఉపకారం చేసినా అందువల్ల తనే ఏదో ప్రయోజనం పొందుతున్నట్లు మాట్లాడడం ఆయన ప్రత్యేకత

నాకూ, శ్రీమతికీకూడా నారాయణ మూర్తిగారన్నా, ఆయన కుటుంబమన్నా, ఎంతో యిష్టమేర్పడింది.

ఆ వీధిలో ఏ ఇద్దరు కలుసుకున్నా నారాయణమూర్తిగారి గురించే మాట్లాడుకుంటారం.

"అడిగితే సాయపడేవారే అరుదు. అలాంటివడిగి సాయపడేవారు దొరికితే అది మన అదృష్టం-" అనేది తరచుగా మేమనుకునేమాట.

ఇలా ఉండగా నా పక్కింట్లో వాటా ఖాళీ అయింది. అందులోకికూడా కొత్త దంపతులు వచ్చేరు. అతడిపేరు రమణ, ఆమె పేరు శాంత.

ఆ వీధికి మేమూ, వాళ్ళూ మాత్రమే కొత్తదంపతులం, అందువల్ల శ్రీమతికీ, శాంతకూ - నాకూ, రమణకూ మంచి దోస్తీ కుదిరింది. తరచు కలుసుకుంటూండేవాళ్ళం.

రమణ స్వభావం వేరు. అతడికి మంచి చొరవుంది. ఎక్కడికైనా వెళ్ళి ఏమైనా సాధించుకు రాగలడు. శాంత తన భర్త సామర్థ్యం గురించి కథలుగా చెబుతూంటుంది.

"మీకేం కావాలన్నా నన్నడగండి. నేను చేసి పెడతాను" అంటూండేవాడు రమణ.

"ఈ వీధిలో అందరూ అన్నింటికీ నారాయణమూర్తిగారిమీద ఆధారపడతారు-" అన్నాను. రేషన్ కార్డుకు నారాయణమూర్తిగారితో చెప్పడం మంచిదన్నాను. రమణ అభిమానపడ్డాడు. మర్నాడికల్లా తనే సంపాదించుకునివచ్చి గర్వంగా నాకు చూపించాడు.

"ఒకరి సాయం అక్కర్లేదు నాకు. ఇది సంపాదించడానికి మీకెంత ఖర్చయింది?" అన్నాడతడు.

"పదిరూపాయలు-" అన్నాను.

"నాకు అయిదే అయిదు రూపాయలయింది. మీరు దెబ్బ తిన్నారు. బహుశా అది నారాయణమూర్తిగారి కమీషనై ఉంటుంది..."

"ఛా-ఆయనలాంటిమనిషి కాదు...." అన్నాను.

"కమీషనంటే కమీషన్ కాదు-" అన్నాడు రమణ- "చాలాకాలంగా ఇక్కడున్న మూలాన ఆయనకు నాలుగురకాల మనుషులతో పరిచయముంటుంది. మీలాంటి వారిచేత ఆయన అయిదిచ్చేచోట పదిప్పిస్తే-ఆయన పనులన్నీ ఊరికే అవుతూంటాయి."

నేను మాట్లాడలేదు.


ఆ విధంగా ప్రారంభించాడు రమణ. అతడు నారాయణమూర్తిగారికంటే చురుకుగా ఆయన సాధించలేని పనులన్నీ సాధించుకు వస్తున్నాడు. ఆ వీధిలో నారాయణమూర్తిగారిని మించిన పేరు తెచ్చుకోవాలని అతడి తాపత్రయం.

"పుస్తకాలు మనంఒక్కరిమే ఎందుకు చదవాలి? అందరూ తలోపుస్తకం కొనుక్కుని చేతులు మార్చుకుంటే మనం ఒకరి దయా ధర్మంమీద ఆధారపడ్డట్టవదు-" అన్నాడతడు.

ఇది చాలామందికి నచ్చింది. ఉన్నట్టుండి మా వీధిలో ఎందరిలోనో ఆత్మగౌరవం గురించిన ఆలోచన లేచింది. ఇంతకాలం తామెవరికో అమ్ముడు పోయినట్టూ - అందులోంచి బయటపడినట్టూ అందరూ అనుకోసాగారు.

నారాయణమూర్తిగారింటికి పుస్తకాలకు వెళ్ళేవారి సంఖ్య తగ్గిపోయింది. నేనుమాత్రం ఇంకా ఆయనింటినుంచే






పుస్తకాలు తెచ్చుకుంటున్నాను. వీధిలో ప్రారంభమైన పుస్తకాల ఉద్యమం గురించి విని- "మంచిది పత్రికలను ప్రోత్సహించడానికి చదివితే చాలదు... కొనాలికూడా!" అన్నాడాయన.

"మీరూ క్లబ్బులో చేరి కొన్ని పుస్తకాలు కొనడం తగ్గించేయకూడదూ?" అన్నాను.

"చదవాలనుకున్న పుస్తకం కొనుక్కోవడం నా అలవాటు-"

ఇది నేను రమణకు చెప్పాను.

"అంటే ఇంకా నీకర్థం కాలేదా? ఆయన ఇంతకాలం తననుంచి పుస్తకాలు తీసుకుని వెళ్ళిన వారిని చిన్నబుచ్చుతున్నాడు..."

నిజమేననిపించింది నాకు. నేనూ పుస్తకాల క్లబ్బులో చేరాను.

ఫోన్స్‌గురించికూడా రమణ ఇలాంటి ఉద్యమమే లేవదీశాడు.

"నారాయణమూర్తిగారికి అహంకారం. తనింటికి ఒకరు వెళ్ళడమేకానీ ఆయన ఒకరింటికి వస్తాడా? అలాంటి వారింటికి ఫోన్ చేయడానికి వెళ్ళడమెందుకు? అర్ధరూపాయిస్తే హోటలువాడు చేసుకోనిస్తాడు!" అన్నాడు రమణ.

మా వీధికి చివరగా ఓ హోటలుంది. రమణ పేరుచెప్పి హోటలువాడికి ఫోను గిరాకీ పెరిగింది.

నారాయణమూర్తి గారింటికి ఫోను గురించి వెళ్ళేవారి సంఖ్య తగ్గిపోయింది.

ఒకరోజు నేనాయనింటికి వెళ్ళి- "మీరూ, మీ ఇంట్లోవాళ్ళూ ఇల్లు కదలరు. కాస్త నలుగురిళ్ళకీ వెడుతూండరాదూ?" అన్నాను.

"తీరికెక్కడిదయ్యా?" అన్నారాయన.

"ఇదివరకైతే పుస్తకాలగురించీ, ఫోన్ గురించీ జనాలు వస్తూండేవారు. ఇప్పుడు మీకు రికార్డింగు పనికూడా తగ్గిపోయింది"

"బాగుందయ్యా. అప్పుడు కొన్ని పుస్తకాలు చదువుకుందుకు తీరుబడి ఉండేది కాదు. ఇప్పుడాపని చేస్తున్నాను. మా ఆవిడ ఇంటి డెకరేషన్ మారుస్తోంది. తను మంచి ఆర్టిస్టు. పిల్లలేమో సంగీత సాధన చేస్తున్నారు..." అని- "ఇంట్లో వుంటే ఎన్నో మంచిపనులు చేసుకోవచ్చు ఎందుకయ్యా ఊసుపోక కబుర్లకోసం అటూ యిటూ తిరగడం-" అన్నాడాయన.

"అయితే మీరెవరిళ్ళకూ వెళ్ళరా?" అన్నాను.

"పిలిస్తే తప్పకుండా వెడతాను. పిలవ

కుండా ఒకరింటికి వెళ్ళే అలవాటు నాకు లేదు..."

"మీ యింటికి వచ్చేవారూ అలాగే అనుకుంటే?"

"మన వీధిలో వాళ్ళలో పిలిచే అవకాశం నాకిచ్చినవారెందరున్నారు చెప్పు."

నేను మాట్లాడలేదు. ఇదీ రమణకు చెప్పాను.

"ఆత్మ గౌరవమున్న వాడెవడూ ఆయనింటికి వెళ్ళడు" అన్నాడు రమణ. అతడాయన మాటలకు మంచి ప్రచారం తీసుకుని వచ్చేడు.

వీధిలో నారాయణ మూర్తిగారి గురించిన దుష్ప్రచారం ఘోరంగా సాగిపోతోంది.

ఆయన అహంకారి. తనింటికి అంతా రావాలి. తనొకరింటికి పిలవందే వెళ్ళడు. ఆయన అందరికీ సాయపడతాడు. తనొకరి సాయాన్నాశించడు.

రమణ రాకుంటే ఈ విషయం మేమెవ్వరం తెలుసుకోలేక పోయేవాళ్ళం. ఇప్పుడంవరం ఇంచుమించు ఆయనింటికి వెళ్ళడం మానేశాం.

ఆ వీధిలో నారాయణ మూర్తిగారినే అంటిపెట్టుకున్న వారొకరో యిద్దరో మిగిలారు. వారిదగ్గర చాలామంది ఆయన్ను గురించిన సూటీ పోటీ మాటలనేవారు.

నారాయణ మూర్తిగారిలో మార్పు లేదు. ఆయన ఎప్పటిలాగే నలుగుర్నీ నవ్వుతూ పలకరిస్తున్నాడు. సాయం కావాలా అనడుగుతున్నాడు. ఈమధ్యనే ఆయన వీడియోకూడా కొన్నాడు.

"జనాల్నాకర్షించడానికిదో ఎత్తు. ఎవరూ చూడ్డానిక్కూడా వెళ్ళొద్దు-" అన్నాడు రమణ.

నారాయణ మూర్తిగారు ఎవర్నీ పిలవలేదు.

చూడ్డానికెవరూ వెళ్ళలేదు.

నాకూ నారాయణ మూర్తిగారికీ కూడా ఇప్పుడంతంత మాత్రంగానే ఉంటోంది. అయన్ను చూడగానే నాలో ఆవేశం రగుల్తోంది. ఆయన ఎప్పటిలాగే ఉండగల్గుతూంటే నాకు వళ్ళు మండిపోతోంది.

ఇలా ఉండగా ఒక రోజున నాకు టెలిగ్రాం వచ్చింది.

మా అత్తగారి ఆరోగ్యం బాగోలేదట. వెంటనే బయల్దేరి రమ్మని ఉందందులో.

టెలిగ్రాం ఆ్రరోజుల తర్వాత అందింది.

శ్రీమతి ఏడుపు లంకించుకుంది.

అత్తగారి పొజిషనెలాగుందో అర్జంటుగా తెలుసుకునేందుకు నేను కాఫీహోటలుకు వెళ్ళాను-ఫోన్ చేయాలని!

అది అవుటాఫార్డరు.

దగ్గర్లో నారాయణ మూర్తిగారికి తప్ప ఫోన్ లేదు.


రమణకు చెప్పుకున్నాను.

అర్జంటైనప్పుడామాత్రం ఫోన్ వాడుకుంటే తప్పులేదు. నారాయణ మూర్తిగారింటికి వెళ్ళు-" అన్నాడు రమణ.

రమణ తేలిగ్గా అనేశాడుకానీ నాకు మనసొప్పలేదు.

పిలవందే ఎన్నిసార్లో నేనూ, శ్రీమతి ఆయనింటికి వెళ్ళాం. ఆయనమాత్రం పిలవందే రానన్నాడు. అహంకారి ఆయన గురించి వ్యతిరేక ప్రచారాన్ని నేనూ నమ్మి ప్రచారంకూడా చేశాను. అలాంటప్పుడు ఆయనింటికి నేనెలా వెళ్ళగలను?






జయరామయ్యగారింటికి వెళ్ళాను. ఆయన చుట్టాలెవరికో ఫోనుంది. వాళ్ళిల్లు కాస్త దూరమే అయినా మరీ పోస్టాఫీసంత దూరం కాదు.

జయరామయ్య నవ్వి - "నారాయణ మూర్తిగారున్నారుగా -" అన్నాడు.

"ఆయనింటికా?" అన్నాను నిరసనగా.

"ఏం-ఇదివరకెన్నడూ వెళ్ళలేదా?"

"అప్పట్లో ఆయన అహంకారం గురించి తెలియదునాకు-"

"అహంకారమంటే?"

చెప్పాను.

"ఇతరులను సాయమడక్కుండా - వారికి సాయపడితే అది అహంకారమనిపించుకుంటుందా?" అన్నాడు జయరామయ్య.

"అనిపించుకుంటుంది కాబట్టే వీధంతా అయన్ని వెలివేశారు..." అన్నాను.

"వెలివేయడమేమిటి? ఆయన నిక్షేపంలా ఉన్నాడు..."

"ఇప్పుడెవరూ ఆయనింటికి వెళ్ళడం లేదు..."

"ఒకప్పుడాయన రమ్మన్నాడని వెళ్ళారా? ఎవరి అవసరం కొద్దీ వారు వెళ్ళారు..." అన్నాడు జయరామయ్య.

"అయితే మాత్రం ఆయన కాస్త మర్యాద చూపవద్దూ?"

మర్యాదంటే ఏమిటి? నీ అవసరం గురించి నువ్వు వాళ్ళింటికి వెడితే అవసరం లేకున్నా నీ యింటి కాయన రాకపోవడమా? నీకు సాయం చేసినందుకు అవసరం లేకపోయినా తను ఏదో ఒక సాయమడగడమా? అన్నాడు జయరామయ్య చిరాగ్గా.

ఏంచెప్పాలో అర్థంకాక - "ఇచ్చిపుచ్చుకోవడంలోనే సహజీవనముంటుంది -" అన్నాను,

నారాయణమూర్తిగారు నీకంత సులభంగా అర్థం కాదులే. ముందాయనింటికి వెళ్ళి నీ పరిస్థితి చెప్పుకో - రమణకూ ఆయనకూ తేడా తెలుస్తుంది-" అన్నాడు జయరామయ్య.

"ఇంత జరిగేక ఆయనింటికెలా వెళ్ళను?" అన్నాను.

"నువ్వేదో ఊహాలోకంలో ఉన్నావు. ఇంత జరిగిందను కునేందుకు మీ ఇద్దరి మధ్య నా గొడవలయ్యాయా, ఏవు

న్నానా?" అన్నాడు జయరామయ్య నవ్వుతూ.

నిజమే! నా భావాలన్నీ హీనసికం.

ఏమైతే అయిందని జయరామయ్య సలహా పాటించేను. నారాయణమూర్తి గారు సాదరంగా నన్నాహ్వానించి విషయం తెలుసుకుని వాళ్ళబ్బాయిని పిలిచి "ఒరేయ్—నువ్వుఅంకుల్ని స్కూటరుమీద సీతాపతి మామయ్యింటికి తీసుకుని వెళ్ళు" అన్నారు.

"ఏం - మీఫోన్ పని చేయడంలేదా?"

"నా ఫోనైతే ఎస్ టీడీ చేయడానికి లేదు. నాది మామూలుద్యోగం. దూరాన్నుంచి కాల్స్ రిసీవ్ చేసుకుందుకూ, లోకల్ కాల్స్ చేసుకుందుకూ తప్ప నాకు ఫోనవసరమేముంది? ఇక్కడ్నించయితే ట్రంకాల్ చేయాలి. అందుకెంతసేపైనా ఎదురు చూడాల్సి రావచ్చు. నా బావ మరిదిది వ్యాపారం...."

నేను మొహమాటపడినా బలవంతపెట్టి ఆయన పంపించేరు. నేను ఫోన్ చేశానాయన బావ మరిది ఇంటినుంచి.

అత్తగారి పరిస్థితి బాగుంది ఒకేఒక్క రోజు చాలా ప్రమాదకర పరిస్థితి ఏర్పడితే టెలిగ్రాం ఇచ్చారుట. ఆ మర్నాడే పరిస్థితి మామూలుగా అయిపోయింది. ఇప్పుడు మేము వెళ్ళాల్సిన అవసరం లేదు. టెలిగ్రాం ఆలస్యంగా అందిందని వాళ్ళు చాలా ఆశ్చర్య పడ్డారు.

సంతోషంగా యింటికి వెళ్ళాను.

"ముందు నారాయణమూర్తిగారికి థాంక్స్ చెప్పుకోవాలండీ అంది శ్రీమతి.

ఇద్దరం వాళ్ళింటి కెళితే ఆయనెంతో సాదరంగా ఆహ్వానించారు. ఇంటిల్లిపాదీ ఎప్పటి లాగే ప్రేమగా మాట్లాడారు.

ఆయనను అకారణంగా ద్వేషించి నందుకు బాధపడి నా కళ్ళు తెరిపించి నందుకు కృతజ్ఞతా పూర్వకంగా జయరామయ్య ఇంటికి కూడా వెళ్ళాను.

"రమణ ఒక్క మాటతో నిన్ను వదుల్చుకున్నాడు. నారాయణమూర్తి తన కొడుకు స్కూటరు మీద తన వాళ్ళింటికి పంపాడు. అది అహంకార మంటాడు రమణ. కానీ నీ సమస్యను నీ కనుకూలంగా పరిష్కరించడం ఆయన బాధ్యతగా తీసుకున్నాడు. అది అర్థం చేసుకుంటే చాలు నువ్వు..."

"ఇకనుంచి పుస్తకాలాయనింటి నుంచే తెచ్చుకుంటాను అన్నింటికీ ఆయన పైనే ఆధార పడతాను..." అన్ననావేశంగా

"ఆపని మాత్రం చేయకు. ఆయన సాయం తీసుకోవడంలోనే ఆయన్ను గౌరవించడ మందనుకుంటే అది నీ తెలివి తక్కువ తనం అవుతుంది -" అన్నాడు జయరామయ్య.

"అంటే?"

"సాయం పొందే మనిషిలో ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్ ఉంటుంది. రమణ వంటి వారికాంప్లెక్స్‌ను రెచ్చగొట్టి నారాయణమూర్తిగారి వంటివారి మీద అపార్థాలు సృష్టించగలరు. అయితే మూర్తి గారికి రమణ తనకు తెలియకుండానే ఉపకారం చేస్తున్నాడు. ఎదుటి మనిషిలో మంచితనం కంటె చెడ్డను వెతకడానికే ప్రతి మనిషి ప్రయత్నిస్తాడు. అందుకే నువ్వూ అతడి మాటలు నమ్మావు. మీ వంటి వారుండకపోతే నారాయణమూర్తి గారికి చేతినిండా పనెక్కువై చాలా ఇబ్బంది పడాలిగదా! రమణ ధర్మమా అని ఆయింట్లో వాళ్ళందరికీ స్వంత పనులు చూసుకునే తీరిక ఏర్పడింది. తమకుతామై వారెవరినీ కాదనరుగదా!" అన్నాడు జయరామయ్య.

అప్పుడు నాకు నారాయణమూర్తిగారికి సంబంధించి నాకంటే రమణే మంచి మిత్రుడనిపించింది. ●

